# క్రీడలకు ప్రాధాన్యం

- గురుకుల విద్యార్థులు ఒలింపిక్స్‌లో ఆడే స్థాయికి ఎదగాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల సొసైటీ సంయుక్త కార్యదర్శి శారద
- నంది మేడారంలో ముగిసిన రాష్ట్ర స్థాయి బాలికల పోటీలు
- విజేతలకు ట్రోఫీ బహూకరణ

ధర్మారం, డిసెంబర్ 12 : క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, గురుకుల విద్యాలయాల విద్యార్థులు ఒలింపిక్స్‌లో ఆడే స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల సొసైటీ సంయుక్త కార్యదర్శి శారద పిలుపునిచ్చారు. ధర్మారం మండలం నంది మేడారంలోని బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 9 నుంచి రాష్ట్రస్థాయి గురుకుల క్రీడాపోటీలు నిర్వహించగా, మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ ఎన్నికైన క్రీడాకారులను ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్‌ఎల్)కు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అండర్-14 కబడ్డీ విభాగంలో విజేతగా నిలిచిన పాలకుర్తి జట్టుకు ట్రోఫీని అందిస్తున్న గురుకులాల సొసైటీ సంయుక్త కార్యదర్శి శారద

### విజేతలు వీరే..

అండర్-14, 17, 19 విభాగాల్లో జరిగిన క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. కబడ్డీ అండర్ -14 విభాగంలో పాలకుర్తి జట్టు మన్ననూరు జట్టుపై విజయం సాధించింది. టెన్నీకాయిట్‌లో ధర్మారం జట్టుకు చెందిన ఆర్. ఉష, ఎస్ మృదుల విజేతలుగా నిలవగా మణికొండకు చెందిన జీ నవ్య, కే అంజలి రన్నర్‌గా నిలిచారు. చెస్‌లో తొర్రూరుకు చెందిన బీ శ్రీలాస్య విన్నర్‌గా నిలువగా, హుజూరాబాద్‌కు చెందిన ఎస్ ఐశ్వర్య రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ అండర్ -17 విభాగంలో భద్రాచలం జట్టు విన్నర్‌గా నిలవగా, పరకాల రన్నర్‌గా నిలిచింది. కబడ్డీలో ముల్కాలపల్లి జట్టు విన్నర్‌గా, ఎక్లరా జట్టు రన్నర్‌గా నిలిచాయి. టెన్నీకాయిట్‌లో నడిగూడెం జట్టులో ఎం కావేరి, ఎం కీర్తన విన్నర్‌గా నిలవగా, మల్కాజిగిరి జట్టులో ఎస్ నిఖిత, ఎం లలిత రన్నర్‌గా నిలిచారు. చెస్‌లో కొల్లాపూర్ విద్యాలయం విద్యార్థిని ఎస్ వైష్ణవి విన్నర్‌గా, ఆర్మూర్ విద్యార్థిని ఈ వనజ రన్నర్‌గా నిలిచారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో మహేంద్రహిల్స్ జట్టు విన్నర్‌గా, రాయపర్తి జట్టు రన్నర్‌గా నిలిచాయి. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ధర్మారం జట్టు విన్నర్‌గా, మధిర రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్ -19 విభాగంలో పాలకుర్తి జట్టు విన్నర్‌గా, బొర్లాం జట్టు రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీలో నకిరేకల్ జట్టు విన్నర్‌గా, తాడ్‌కోల్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. టెన్నీకాయిట్‌లో మడికొండకు చెందిన బీ పూజ, ఎన్ బిందు విన్నర్‌లుగా నిలవగా, నంచర్లకు చెందిన బీ లావణ్య, జీ సరిత రన్నర్‌లుగా నిలిచారు. చెస్‌లో కొత్తకోటకు చెందిన జే లక్ష్మీ విన్నర్‌గా, అడవిమల్లెకు చెందిన పీ సుధారాణి రన్నర్‌గా నిలిచింది. హ్యాండ్‌బాల్‌లో రాయపర్తి జట్టు విన్నర్‌గా నిలవగా, జాఫర్‌గడ్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మధిర జట్టు విన్నర్‌గా నిలవగా, ధర్మసాగర్ జట్టు రన్నర్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి నంది మేడారం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షత వహించగా, ఆర్డీఓ మధు మోహన్, గురుకులాల నోడల్ అధికారి శేషి కుమారి, కరీంనగర్ ఆర్‌సీవో శ్రీనివాస్ రెడ్డి, డీసీలు జాక్విలిన్, వెంకటేశ్వర్‌రావు, మంజుల, కరీంనగర్ రీజియన్ ప్రిన్సిపాల్, కరీంనగర్ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దేవి శ్రీధర్, తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో భీమ జయశీల, ఎస్‌ఐలు తనుగుల సత్యనారాయణ, అశ్విని, నందిమేడారం పీహెచ్‌సీ డాక్టర్లు సుస్మిత, గౌతమ్, క్రీడ ఆర్గనైజర్లు నీరజ, సుష్మ, పీడీ సరిత, పీఈటీ నర్మద పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కాళేశ్వరం జోన్ - 1 క్రీడాకారులు



ముగింపు కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు




మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కాళేశ్వరం జోన్ - 1 క్రీడాకారులు



# ఆయిల్ పామ్ సేద్యం.. ఆదాయం ఘనం



సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో రైతు ఎర్రం వెంకట్రాజం పొలంలో నాటిన ఆయిల్ పామ్ మొక్కలు

- పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ
- ఒక్కసారి సాగుచేస్తే 30 ఏళ్ల దాకా దిగుబడి
- ఎకరానికి రూ.లక్షకుపైనే ఇన్‌కం
- సాగుకు సర్కారు ప్రోత్సాహం
- సిరిసిల్ల జిల్లాలో మూడు వేల ఎకరాలు సాగు లక్ష్యం
- ఇప్పటికే 2,275 ఎకరాల్లో పంట
- ఈ సీజన్‌లో టార్గెట్ పూర్తి చేసేందుకు యంత్రాంగం అడుగులు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): వ్యవసాయంలో రైతులు అనాదిగా సంప్రదాయ పంటలే వేస్తున్నారు. మార్కెట్లో డిమాండ్‌ను బట్టి కాకుండా పాత కాలం నాటి సేద్య విధానాలే పాటిస్తున్నారు. ఫలితంగా లాభం వస్తే తీసుకుంటున్నారు. లేదంటే నష్టపోతున్నారు. ఈ క్రమంలో పరిస్థితిని గుర్తించిన గత బీఆర్‌ఎస్ సర్కారు మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించింది. ఈ క్రమంలో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి సాగుకు అనువుగా ఉన్న మండలాలను సూచించగా, ఉద్యాన వన శాఖ రంగంలోకి దిగి జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించింది. రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్యాలయ శాస్త్రవేత్తలను రప్పించి వారితో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టగా, రైతాంగం చైతన్యవంతమైంది.

### సిరిసిల్లలో టార్గెట్ 3వేల ఎకరాలు

ఉద్యానవన శాఖ అధికారులు జిల్లాలో మూడు వేల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా 13 మండలాల్లోని ఔత్సాహిక రైతుల వివరాలు సేకరించారు. వరి, పత్తి, మక్క పంటలకే పరిమితమైన రైతులకు అవగాహన కల్పించి మొక్కలు నాటేలా ప్రోత్సహించారు. మొక్కల పెంపకానికి ఎకరానికి రూ.16,800 సర్కారు సబ్సిడీ ఇవ్వగా, చాలా మంది రైతులు ఆసక్తి



చూపారు. ముందుకొచ్చిన రైతుల ను దశల వారీగా ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు తీసుకెళ్లారు. సాగు చేస్తున్న రైతులు, ఆయిల్ పామ్ గింజల నుంచి నూనే తీసే ఫ్యాక్టరీల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ కమం లో గతేడాది 390 మంది రైతులు తమ భూముల్లో 1274 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. ఈ యేడాది 1003 ఎకరాల్లో సాగు లక్ష్యం పూర్తి కాగా, ఇప్పటి వరకు 292 మంది రైతులు సాగు చేశారు. మరో 725 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఈ సీజన్‌లో బోయినిపల్లి మండలంలో 75.85ఎకరాలు, చందుర్తి మండలంలో 57.205, గంభీరావుపేట 46.885, ఇల్లంతకుంట 137.08, కోనరావుపేట 77.08, ముస్తాబాద్ 206.355, రుద్రంగి 18.575, సిరిసిల్ల 12.7, తంగళ్లపల్లి 137.505, వీర్నపల్లి 14.75, వేములవాడ అర్బన్ మండలం 6.555, వేములవాడ రూరల్ మండలంలో 71.38, ఎల్లారెడ్డిపేట మండలంలో 141.475 ఎకరాలలో సాగు చేపట్టారు.

### 30ఏండ్ల దాకా దిగుబడి

ఆయిల్‌పామ్ సాగులో భారీ లాభాలుండే అవకాశమున్నది. నాటిన మొక్క ఐదేండ్ల నుంచి 30 ఏండ్ల దాకా దిగుబడినిస్తుంది. ఒక్కో చెట్టుకు ఏడు నుంచి ఎనిమిది గెలలు వస్తాయి. రైతు నిర్వహణను బట్టి గెల సైజు 20నుంచి 60 కిలోల మధ్య ఉంటుంది. ప్రస్తుతం టన్ను ధర మార్కెట్‌లో ₹15వేల నుంచి ₹20వేల దాకా పలుకుతుంది. కాగా, జిల్లాలో నాటి న ఆయిల్‌పామ్ మొక్కలు మంచిగా పెరుగుతున్నా యి. ఏడాదికే ఆరు మీటర్ల ఎత్తుకు చేరుకున్నాయి. 2022లో నాటిన మొక్కలు ఈ నెలాఖరుతో రెండేళ్లు పూర్తి చేసుకుంటాయి. మరోవైపు గింజల నుంచి నూ నె తీసే ఫ్యాక్టరీలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తుండగా, రైతులు మరింత ఉత్సాహం చూపుతున్నారు.

### అంతర పంటలూ వేసుకోవచ్చు..

ఆయిల్ పామ్ పంట సాగు చేసే రైతులు అంతర పంటలూ సాగు చేసుకోవచ్చు. పత్తి, మిర్చి, కూరగాయలు, పసుపు, మక్క, పొద్దుతిరుగుడు, టమాట, బీర, శ్రీగంధం, సోయాబీన్, పెసళ్లు, మినుములు, పప్పు దినుసులు, పత్తి పంటలను సాగు చేసుకోవచ్చు. చీడపీడల ఇబ్బందుల ఉండవు. ఇతర పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులను 30 శాతం ఉపయోగిస్తే సరిపోతుంది. దిగుబడిలో సైతం ఎలాంటి తేడాలు ఉండని అధికారులు చెబుతున్నారు.

### లాభదాయక పంట



ఈ ప్రాంత రైతులు చాలా కాలంగా ఒకే రకమైన పంట వేస్తున్నారు. దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నట్లు గుర్తించాం. అందుకే కొత్త పంటలు సాగు చేయాలని చెబుతున్నాం. ప్రస్తుతం ఆయిల్ పామ్ తోటల సాగులో మంచి లాభం ఉంది. ఈ పంట సాగు వల్ల రైతులకు ఎలాంటి నష్టం లేదు. మొక్కల మధ్య ఆరుతడి పంటలు కంది, పెసర, జామ, మామిడి మొక్కలు కూడా సాగు చేసుకోవచ్చు. కూరగాయలు పెట్టుకోవచ్చు. ప్రభుత్వం కూడా ఎకరానికి ₹16,800 సబ్సిడీ ఇస్తున్నది. చాలా మంది రైతులు ముందుకొస్తున్నారు. ఇప్పటి వరకు రెండు వేల ఎకరాలపైనే సాగు చేశారు. త్వరలోనే నిర్ధేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

**- జ్యోతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (రాజన్న సిరిసిల్ల)**



ఆరుమీటర్ల ఎత్తుకు చేరిన ఆయిల్ పామ్ మొక్క

# కొండగట్టు జన సంద్రం

మల్యాల, డిసెంబర్ 12: కొండగట్టు అంజన్న క్షేత్రం కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పోటెత్తింది. భక్తులు మంగళవారం ఉదయాన్నే పుష్కరిణిలో స్నానం చేసి, స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ చైర్మన్ మారుతీస్వామి, ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్ భక్తుల రద్దీని గమనిస్తూ క్యూలైన్‌లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. కాగా, స్వామివారిని 20 వేల మంది దర్శించుకున్నారని, వివిధ సేవల రూపంలో ఆలయానికి ₹8లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, సంపత్, లక్ష్మీరాజం, పోలీస్‌శాఖ ఏఎస్‌ఐ చిలుక శ్రీనివాస్ ఉన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయ ప్రాంగణంలో భక్తు రద్దీ

# నిప్పు పెడితే ముప్పే

రైతులు ఇప్పుడిప్పుడు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మొన్నటి వరకు వరికోయగా, మిగిలిన కొయ్యకాళ్లు లేకుండా చేసేందుకు చాలా మంది నిప్పు పెడుతున్నారు. ప్రతి సీజన్‌లోనూ ఇలా చేస్తుండడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. నేలకు సారాన్ని చేకూర్చే క్రిమికీటకాలు నశించిపోవడంతోపాటు వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. భూ సమతుల్యత దెబ్బతింటూ, మరో పంటపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఒక్కోసారి రైతుల ప్రాణాలకూ ముప్పు ఏర్పడుతున్నది. వరికొయ్యలు కాల్చడం కర్షకుడికి తెలియకుండానే తీరని నష్టాన్ని మిగులుస్తుండగా, తగులబెట్టకుండా పొలంలో కలియదున్నితే ఎంతో మేలు జరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు.

కరీంనగర్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పొలం కోసిన తర్వాత గడ్డిని గతంలో రైతులు ఎంతో జాగ్రత్తగా కాపాడుకునేవారు. ధాన్యం తడిచినా పెద్దగా ఇబ్బంది పడకపోయినా.. గడ్డి తడిస్తే మాత్రం చాలా మదనపడేవారు. పశువుల కోసం అంతలా ఆరాటపడేవారు. పోచ.. పోచ జమచేసి కప్పేసి ఏడాదంతా మేతకు వాడేవారు. అయితే, కాలక్రమేనా పశువుల వినియోగం తగ్గడం, మిషన్ల వాడకం పెరగడంతో ఇప్పుడు అదే గడ్డిని మడిలోనే తగుల బెడుతున్నారు. పర్యావరణ కాలుష్యానికి కారణం అవుతున్నారు. కాల్చడం వల్ల అపార నష్టాలున్నయంటూ శాస్త్రవేత్తలు పదే పదే చెబుతున్నా మెజార్టీ రైతులు వరి కొయ్యలను, గడ్డిని తగుల పెడుతూనే ఉన్నారు. తద్వారా తాను తీసుకున్న గొయ్యిలో తానేపడ్డట్లు అవుతున్నది. రైతన్న పరిస్థితి. ఈ విధానం వల్ల ప్రకృతి దెబ్బతినడమేకాదు, అన్నదాత అన్ని రకాలుగా నష్టపోతున్నాడు. పంటకు మేలుచేసే సూక్ష్మజీవులు చనిపోవడమేకాదు, సారవంతమైనభూమి దెబ్బ తింటుంది. దిగుబడిపై ప్రభావం చూపుతుంది. వాతావరణం కలుషితం అవుతుంది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వరి కొయ్యలే సిరులు కురిపిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- కొయ్యకాలుకు కాల్చితే నేల సమతుల్యతకు విఘాతం
- భూసారంతోపాటు పంట దిగుబడులూ తగ్గే ప్రమాదం
- కలియ దున్నినా..సేంద్రియ ఎరువుగా మార్చినా ప్రయోజనం
- అగ్ని ప్రమాదాల వల్ల రైతుల ఆరోగ్యానికి హాని
- ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు
- గడ్డిని సేంద్రియ ఎరువుగా మారిస్తే సిరుల పంట
- తద్వారా 70 శాతం తగ్గనున్న ఎరువుల వినియోగం



ముస్తాబాద్ మండలంలోని చీకోడులో వరి కొయ్యకు పెట్టిన నిప్పు( ఫైల్ )

### నాడు పశువులకు మేత.. నేడు కాలి బూడిద..

నాడు వరిని కొడవళ్లతో మొదళ్ల వరకు కోసేవారు. అప్పట్లో రైతన్న ఇంట ఉన్న పశువుల మేత కోసం పశుగ్రాసాన్ని కుప్పలు (గడ్డివాములు) పెట్టుకునేవారు. చిన్న గడ్డి పోచను కూడా విడిచి పెట్టకుండా.. ఎండబెట్టి కుప్పవేసి ఏడాదంతా పశువులకు మేతగా ఉపయోగించే వారు. కానీ, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగింది. దాంతోపాటే పశువుల సంఖ్య చాలా వరకు తగ్గిపోయింది. రైతుకు గడ్డి అవసరం లేకుండా పోయింది. వరికోత యంత్రాలు వచ్చిన తర్వాత వరిని కొడవళ్లతో కాకుండా యంత్రాలతో కోస్తున్నారు. ఈ యంత్రాలు మొదళ్ల వరకు కాకుండా 25 నుంచి 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నాయి. దాంతో కొయ్యకాళ్లు మిగిలిపోతున్నాయి. దీనిని అలా గే వదిలేస్తే వ్యర్థ పదార్థంగా మారి పంట అవశేషంగానే మిగిలిపోతుంది. పంటకు-పంటకు మధ్య సమయం తక్కు వ ఉండడంతో ఈ కొయ్యకాళ్లు, వరిగడ్డిని కంపోస్టుగా మార్చుకోవడంపై రైతులకు అవగాహన లేక తగుల పెడుతున్నారు. దీనివల్ల నష్టాలే తప్ప లాభం ఏమా త్రం ఉండదని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి కాల్చే పొగతో రైతు ఊపిరాడక చనిపోయిన సందర్భాలున్నాయని వివరిస్తున్నారు.

### గతంలో పలువురు రైతుల మృతి

గతేడాది మే 12న ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో వరి కొయ్యలకు నిప్పు పెట్టి ఊపిరాడక గుండ ఎంకవ్వ(55) మృతి చెందింది. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తికి చెందిన పోతుగంటి లక్ష్మణ్ (65) సైతం గతేడాది యాసంగి సీజన్‌లో కొయ్యకాళ్లను తగులబెట్టగా, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న గడ్డికుప్పలకు మంటలు అంటుకుంటాయనే భయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించే క్రమంలోనే నిప్పంటుకొని ప్రాణాలు కోల్పోయాడు. గతంలో మానకొండూర్ మండలం మద్దికుంట చెందిన ఓ రైతు ఊపిరాడక చనిపోయాడు.

### విపరీతమైన నష్టాలు

- వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- అధిక వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడి పోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి.
- పొలాలలో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉన్నది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.
- గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బుగ్గవుతున్నాయి.
- మరో ముఖ్య విషయం ఏమిటంటే ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదముంది.
- మంటలు పొలమంతా వ్యాపించడంతో విద్యుత్ మోటర్లు, వైర్లు, పైపులు కాలిపోతాయి.

### దున్నితే చాలా ప్రయోజనాలు

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశమున్నది.
- దుక్కిదున్నే సమయంలో సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని(యూరియా), 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరుగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతుంది.
- నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- ఒక టన్ను వరి గడ్డి కావాలంటే.. ఆ వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి